శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రంగం సిద్ధం

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నప్రసాదం, వసతి, దర్శనం, లడ్డూ నిల్వలు, ఇంజినీరింగ్ పనులు, వాహనాల ఫిట్‌నెస్, కళాబృందాలు, ఉద్యానశాఖ, రవాణా, కల్యాణ కట్ట, గోశాల, శ్రీవారి సేవకులు, టీటీడీ విజిలెన్స్ విభాగం భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. అక్టోబర్ 4న ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 8న శ్రీవారి గరుడసేవ, 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలను రద్దు చేసింది. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

వృద్ధుల దర్శనంపై తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు : టీటీడీ

వృద్ధుల దర్శనంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేసింది. రోజూ వెయ్యి మంది వృద్ధులు, దివ్యాంగులకు దర్శనం కల్పిస్తున్నామని తెలిపింది. మూడు నెలల ముందే ప్రతి నెలా 23న ఆన్‌లైన్ కోటా విడుదల చేస్తున్నామని పేర్కొంది. తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్/పీహెచ్‌సీ లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని వెల్లడించింది. భక్తులు టీటీడీ వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని సూచించింది.

ముగిసిన ఇంద్రకీలాద్రి 'ఆషాడ సారె'

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : ఇంద్రకీలాద్రిపై గత నెల 6న ప్రారంభమైన ఆషాడ సారె కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. తొలిరోజు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వైదిక కమిటీ, అర్చకులు కుటుంబ సమేతంగా అమ్మవారికి ఆషాడ సారె సమర్పించగా, చివరి రోజు ఆలయ ఈవో రామారావు, సిబ్బంది, పండితులు కుటుంబ సమేతంగా సారె సమర్పించారు. రెండు లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో ముగ్గురు హైదరాబాదీల మృతి

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించగా, మరొకరికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని బొల్లారానికి చెందిన నలుగురు యువకులు శనివారం కారులో శ్రీశైలం బయలుదేరారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో వటవర్లపల్లి వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్నవారిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో పోలీసులు గాయపడినవ్యక్తిని దోమలపెంట దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయినవారి వివరాలు తెలియాల్సి ఉంది.

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వైజాగ్‌లో కోర్బా ఎక్స్‌ప్రెస్ బోగీలకు మంటలు

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉంచిన కోర్బా-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైల్‌లోని మూడు ఏసీ బోగీల్లో ఆదివారం మంటలు చెలరేగాయి. రైల్వే సిబ్బంది మంటలను అదుపుచేసేలోపే బీ-6, బీ-7, ఎం-1 బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. రైలులో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రైలు ఉదయం 7 గంటలకు కోర్బా నుంచి విశాఖకు వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

ఆర్టీసీ హామీలపై సర్కారు దాటవేత!

- అపాయింటెడ్ తేదీ, వేతనాలపై లేని స్పష్టత
- కార్మిక సంఘాల ఎన్నికల ఊసే కరువు
- ప్రభుత్వ తీరుపై కార్మికుల్లో ఆగ్రహజ్వాల

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నేడు ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంబిస్తున్నది. ఆర్టీసీని బలోపేతం చేయడంతోపాటు, ఉద్యోగులకు అపాయింటెడ్ తేదీని ప్రకటించి, ప్రభుత్వం నుంచి వేతనాల చెల్లింపు, కార్మిక సంఘాలకు ఎన్నికల వంటి హామీలను విస్మరించడంపై ఆర్టీసీ కార్మిక వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆయా అంశాలపై ఎలాంటి స్పష్టత లేకపోవడంపై కార్మికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీకి బడ్జెట్ ప్రతిపాదనల్లో కేవలం రూ.4,084.43 కోట్లనే ప్రకటించారు. ఈ మొత్తాన్ని మహాలక్ష్మి పథకానికి కేటాయిస్తున్నట్లు చూపారు. బస్సుల్లో రద్దీ పెరగడంతో కొత్త బస్సులు సమకూరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రభుత్వం వీటి కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. రాయితీ బస్‌పాస్‌లకు సంబంధించి రూ.950 కోట్లు, ఇతర అవసరాలకు కావాల్సిన వాటితో కలుపుకొని రూ.1,782 కోట్లపై స్పష్టత లేకపోవడమూ ఆందోళన కలిగిస్తున్నదని ఆర్టీసీ బోర్డు మాజీ సభ్యులు కొందరు పేర్కొన్నారు.

విలీన ప్రక్రియపై ఊసెత్తని వైనం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియపై ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదు. ఈ విషయమై ఉద్యోగ సంఘాలు ఎన్ని పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నది. ఆయా డిమాండ్ల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాయనే కారణంతోనే కార్మిక సంఘాల ఎన్నికలను సైతం నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని కార్మికవర్గాలు పేర్కొంటున్నాయి.

జర్నలిస్టులకు వేజ్‌బోర్డు పునరుద్ధరించాల్సిందే

హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): వర్కింగ్ జర్నలిస్టులకు వేజ్‌బోర్డును పునరుద్ధరించాలన్న ఐజేయూ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చారు. హర్యానాలోని పంచకులలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కృత్రిమమేధ ప్రవేశంతో మీడియా రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఐజేయూ అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యుడు దేవులపల్లి అమర్ దసరా ఉత్సవాల సందర్భంగా దత్తాత్రేయ నిర్వహించే 'అలయ్ బలయ్' ప్రాముఖ్యాన్ని వివరించారు.

వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ సిగ్నల్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయొద్దంటూ పూడూరు మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఆయా సంఘాల నేతలు

నేవీ రాడార్ సిగ్నల్ కేంద్రం మాకొద్దు

పూడూరులో ప్రజా సంఘాల నేతల నిరసన

పూడూరు, ఆగస్టు 4 : వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటు యోచనను విరమించుకోవాలని ఏఐకేఎంఎస్, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ కమిటీల సభ్యులు మహేందర్, శ్రీనివాస్, గీత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం పూడూరులో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేవీ రాడార్ సిగ్నల్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశం ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తే తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మక్కువ చూపిస్తున్నదని ప్రశ్నించారు. రాడార్ ఏర్పాటుతో పశుపక్షాదులు, మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతుందని చెప్పారు. స్థానికుల కోరిక మేరకు ఈ ప్రాజెక్టును విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

రంగారెడ్డి జిల్లా రంగాపూర్‌లో ఘటన

నందిగామ, ఆగస్టు 4: ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీకొనడంతో తల్లీకొడుకు మృతి చెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం రంగాపూర్ దర్గా రోడ్డులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన హాజీర బేగం(35) తన ఇద్దరు కుమారులు అబ్దుల్ రహమాన్(12) అబ్దుల్ రహీంతో కలిసి జేపీ దర్గాకు స్కూటీపై వెళ్తుండగా రంగాపూర్ మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షత గాత్రులను దవాఖానకు తరలిస్తుండగా హాజీర బేగం, అబ్దుల్ రహమాన్ మృతి చెందారు. రహీం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్షెట్టిపేట ఎంజేపీలో ర్యాగింగ్

లక్షెట్టిపేట, ఆగస్టు 4: మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు ఆదివారం ర్యాగింగ్‌తో హంగామా సృష్టించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు.. ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థిపై చేయిచేసుకున్నారు. ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్ వారిని మందిలించే ప్రయత్నం చేయగా, తనపై కూడా సీనియర్లు దురుసుగా ప్రయత్నించినట్టు సమాచారం. ర్యాగింగ్ పేరిట జూనియర్లను వేధించే సీనియర్ విద్యార్థులను ప్రిన్సిపాల్ సన్మార్గంలో పెట్టేందుకు యత్నిస్తే.. పేరెంట్స్ వచ్చి తమ పిల్లల్ని కొడుతున్నారంటూ ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. పేరెంట్స్.. స్టాఫ్ మాట్లాడుతున్న సమయంలో మరోమారు సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థి తరుణ్‌ను చితకబాదారు. దీంతో కోపోద్రిక్తుడైన తరుణ్ ఒక్కసారిగా కిటికీ అద్దాన్ని చేతితో గుద్దడంతో తీవ్ర రక్తస్రావమైంది. పాఠశాల సిబ్బంది అప్రమత్తమై తరుణ్‌ను లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మంచిర్యాల దవాఖానకు తరలించారు. తరుణ్ చేతి నరం తెగిపోయిట్లు సమాచారం. పోలీసులు పాఠశాలకు వెళ్లి విచారణ చేపడుతున్నారు. ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్‌ను వివరణ కోరగా, గొడవ జరిగిన విషయం వాస్తవమేనని, విచారణ చేపడుతున్నామని తెలిపారు.

దసరాలోపు అంబర్‌పేట కారిడార్ పనులు

- ఉప్పల్ - నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు రీ టెండర్లు
- 18 నెలల్లో పనులు పూర్తి చేసి చూపిస్తాం
- రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పీర్జాదిగూడ, ఆగస్టు 4: వరంగల్ జాతీయ రహదారిలో మేడిపల్లి నుంచి అంబర్‌పేట వెళ్లే కారిడార్ రోడ్డు పనులను దసరాలోపు పూర్తి చేస్తామని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. పీర్జాదిగూడలో జాప్యంగా జరుగుతున్న కారిడార్ రోడ్డు పనులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, బీర్ల అయిలయ్య, పీర్జాదిగూడ, బోడుప్పల్ మేయర్లు అజయ్ యాదవ్, జక్క వెంకట్‌రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మేడిపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 15న కారిడార్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ కారిడార్ పనులను సీఎం రేవంత్‌రెడ్డి త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం 72నెలల్లో చేయలేని పనులకు రీ టెండర్లు పిలిచి అక్టోబర్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. 18 నెలల్లో కారిడార్ పనులను పూర్తి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. ఈ పనులకు సుమారు రూ. 300 కోట్ల వరకు వ్యయం పెరుగుతుందని తెలిపారు. మూసీ నది అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రపంచ బ్యాంక్ నిధులతో మూసీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆలేరు వరకు ఇరుపక్కల జరిగే రోడ్డు పనులను ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హరిచందన, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా నాయకులు తోటకూర వజ్రేశ్ యాదవ్, ఆర్‌అండ్‌బీ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి 9 మంది పిల్లలు మృతి

సాగర్ : మధ్య ప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో శిథిలమైన ఇంటి గోడ కూలడంతో తొమ్మిది మంది బాలలు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. షాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఈ దుర్ఘటన జరిగింది. ఎమ్మెల్యే గోపాల్ భార్గవ మాట్లాడుతూ, దేవాలయం సమీపంలో, శిథిలమైన ఇంటివద్ద ఓ టెంట్‌లో పార్థివ శివ లింగాన్ని నిర్మించే కార్యక్రమం జరుగుతుండగా ఈ దారుణం జరిగిందని చెప్పారు. మృతులంతా 10 నుంచి 15 సంవత్సరాల వయసుగల వారే. కలెక్టర్ దీపక్ ఆర్య మాట్లాడుతూ, దేవాలయం సమీపంలోని ఇంటి వద్ద టెంట్‌లో ఈ బాలలు ఉన్నారని, వర్షాల వల్ల ఇంటి గోడ కూలిపోవడంతో ప్రమాదం జరిగిందని చెప్పారు. ఇద్దరు బాలలు అక్కడికక్కడే మరణించగా, ఏడుగురు దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. గాయపడిన మరో ఇద్దరు బాలలు చికిత్స పొందుతున్నారన్నారు.

రుణానికి బీమా రక్ష

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలెన్నో..



గృహ రుణం అంటే దీర్ఘకాల అప్పు. దీన్ని చెల్లించేటప్పుడు అనేక ఒడిదొడుకులు సహజం. అందుకే ఈ రుణానికి బీమా రక్షణ ఇవ్వడం తెలివైన పని అనిపించుకుంటుంది. అప్పుడే మనకు, మన కుటుంబ సభ్యులకు ప్రశాంతత అనేది ఉంటుంది. నిజానికి రుణం తీసుకుంటే దానికి బీమాను కూడా తీసుకోవాలని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)గానీ, ఇటు బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐగానీ చెప్పడం లేదు. అయితే మన లాభం కోసం, మన కుటుంబ సభ్యులకు రుణ భారం లేకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం ఉత్తమం.

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ అంటే?

హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్ (హెచ్ఎల్‌పీపీ) అని కూడా పిలుస్తారు. ఈ స్కీమ్‌లను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థలన్నీ అందిస్తున్నాయి. మరణం, ఆరోగ్యం పాడైపోయి, ఏదైనా కారణం చేత అవయవాలు కోల్పోయి పనిచేయలేని స్థితికి రుణగ్రహీత చేరితే రుణ చెల్లింపుల సంగతిని బీమా సంస్థే చూసుకుంటుంది.

గృహ రుణ బీమా ప్రాముఖ్యత

రుణమిచ్చే బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు.. తమ రుణాలు మొండి బకాయిలుగా మిగిలిపోవాలని చూడవు. అందుకే రుణం తీసుకునేటప్పుడే దానికి బీమా కూడా తీసుకోవాలని రుణగ్రహీతకు ఆయా సంస్థలు చెప్తాయి. దాని ప్రాధాన్యతనూ వివరిస్తాయి. పైగా ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మునుపెన్నడూ లేనివిధంగా విజృంభించిన కరోనా మహమ్మారి.. మానవుల జీవితాలను ఎంతో ప్రభావితం చేసింది. ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఎన్నో విధాలుగా వెనక్కినెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో రుణ బీమా మన కుటుంబాలకు రక్షగా ఉంటుంది. దురదృష్టవశాత్తు చనిపోయినా, పూర్తిగా అంగవైకల్యం బారినపడ్డా బీమా సంస్థే మన రుణ చెల్లింపుల్ని చేస్తుంది. దీనివల్ల మనం లేనిరోజున మనవాళ్లకు కనీసం సొంత ఇల్లైనా దక్కుతుంది. అలాగే ఉద్యోగం కోల్పోయినా ఆసరాగా ఉంటుంది. అయితే స్టాండర్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకోవాలి. మొక్కుబడిగా కాకుండా అన్ని ఫీచర్లున్న బీమాను కొనాలన్నది మర్చిపోవద్దు.

గుర్తుంచుకోండి..

ప్రీమియంలు

గృహ రుణ బీమా కవరేజీ ప్రీమియంను ఒకేసారి మొత్తంగా చెల్లించవచ్చు. లేదా హోమ్ లోన్ ఈఎంఐలతోపాటు నెలనెలా కొంత మొత్తాల్లోనూ చెల్లించవచ్చు.

జాయింట్ హౌజ్ లోన్

సంయుక్త గృహ రుణగ్రహీతలకూ ఈ బీమా ఉపయుక్తంగా ఉంటుంది. కో-అప్లికెంట్స్ అందరికీ ఇది వర్తిస్తుంది. అందువల్ల ఒకవేళ కుటుంబంలోని ముగ్గురు కలిసి రుణాన్ని తీసుకున్నా.. వారిలో దురదృష్టవశాత్తు ఒక్కరు అకాల మరణం పాలైనా బీమా కవరేజీని పొందవచ్చు.

రైడర్స్-యాడ్ ఆన్స్

బేసిక్ గృహ రుణ బీమాలో రుణగ్రహీత చనిపోతే చెల్లుబాటు అవుతుంది. అయినప్పటికీ రైడర్ స్కీమ్‌ను యాడ్ చేసుకోవాలంటే అదనపు ప్రీమియం చెల్లించాల్సిందే. రుణగ్రహీతకు గుండెపోటు, క్యాన్సర్, ఇతర ప్రమాదకర గాయాలపాలైనా బీమా వర్తించగలదు. అంగవైకల్యానికి గురైనా లేదా ఉద్యోగం కోల్పోయినా, ఉపాధి కరువైనా 6 నెలలదాకా ఈఎంఐ చెల్లింపులకు యాడ్ ఆన్స్ కవరేజీని ఇవ్వగలవు.

బీమాలో రకాలు..

హైబ్రిడ్ ప్లాన్లు

హైబ్రిడ్ కవర్ ప్లాన్లలో బీమా కవరేజీ మొత్తం తొలి ఏడాది స్థిరంగా ఉంటుంది. అయితే రెండో ఏడాది నుంచి క్రమేణా కవరేజీ తగ్గిపోతూ ఉంటుంది. గృహ రుణ బకాయి మొత్తాలు కూడా తగ్గుతుండటమే దీనికి కారణం.

లెవల్ కవర్ ప్లాన్లు

గృహ రుణం కాల వ్యవధి ఎప్పటిదాకా ఉంటుందో అప్పటిదాకా ఈ లెవల్ కవర్ ప్లాన్లలో బీమా ప్రయోజనాలు స్థిరంగా ఉంటాయి. రుణ మొత్తాలు తగ్గుతున్నంత మాత్రాన బీమా కవరేజీ తగ్గిపోదు. కాబట్టి ముందే ఆలోచించి ప్లాన్లపై ఓ నిర్ణయం తీసుకోవాలి.

ప్రయోజనాలివే..

పన్ను ప్రోత్సాహకాలు

గృహ రుణగ్రహీతలు.. హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను కూడా తీసుకోవడం వల్ల పన్ను ప్రోత్సాహకాలను అందుకోవచ్చు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద బీమా కోసం చెల్లించే ప్రీమియంలను పన్ను మినహాయింపునకు కోరవచ్చు.

కుటుంబ రక్షణ

కుటుంబ పెద్ద అకాల మరణం పాలైనప్పుడు.. గృహ రుణ భారం ఆ కుటుంబ సభ్యులపై పడకుండా హోమ్ లోన్ ఇన్సూరెన్స్ కాపాడుతుంది. కాబట్టి రుణం తీసుకున్నప్పుడు దానికి బీమా కూడా తీసుకోవడం తెలివైన నిర్ణయమే అవుతుంది.

చివరగా.. ఇన్సూరెన్స్ ప్రీమియంలను రుణ మొత్తం, రీపేమెంట్ టెన్యూర్, రుణగ్రహీత వయస్సు, ఆరోగ్య పరిస్థితులు ప్రభావితం చేయగలవు. అలాగే ఎలాంటి పరిస్థితుల్లో బీమా వర్తిస్తుంది. అత్యుత్తమ బీమా కవరేజీనే తీసుకుంటున్నామా? అన్నదీ పరిశీలించుకోవాలి. క్లెయిమ్ సెటిల్మెంట్లు, పేమెంట్ పద్ధతిని కూడా కనుక్కోవడం మంచిది.

రాజడి

క్రెడిట్ కార్డ్ కావాలా.. నాయనా!

బ్యాంకుల్లో, పెట్రోల్ బంకుల్లో, షాపింగ్ మాల్స్‌లో క్రెడిట్ కార్డ్ కావాలా? అంటూ అడిగితే.. ఊ కొడుతూ వెళ్లే ముందు ఇదికాస్త ఆలోచించుకోండి. మీరు తీసుకునే క్రెడిట్ కార్డ్‌కు సంబంధించిన నియమ, నిబంధనలను పూర్తిగా చదవడం మర్చిపోవద్దు. దానిపై పొందే నగదు మొత్తాలకుపడే వడ్డీరేట్లు, ఇతర ఫీజులు, చార్జీలను తెలుసుకోకుంటే నష్టపోతారు. బ్యాంకింగ్ కస్టమర్ల ప్రయోజనార్థం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ మేరకు సందేశాలను కూడా ఇస్తుండటం గమనార్హం. ఇక క్రెడిట్ కార్డ్‌ను పూర్తిస్థాయిలో వాడుకోకపోవడమే మంచిది. అలాగే వాడుకున్న మొత్తాలను కొద్దికొద్దిగా చెల్లించడం కాకుండా పూర్తిగా చెల్లిస్తేనే వడ్డీభారం పడబోదని గుర్తుంచుకోవాలి.

ఒడిదొడుకులకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం వరుస లాభాల్లో కదలాడాయి. అయితే చివర్లో నష్టాలు దెబ్బతీశాయి. ఆఖరిరోజు శుక్రవారం భారీగా క్షీణించాయి. మదుపరులు ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. దీంతో ఓవరాల్‌గా గత వారం మార్కెట్లు నష్టాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 350.77 పాయింట్లు కోల్పోయి 80,981.95 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 117.15 పాయింట్లు దిగజారి 24,717.70 దగ్గర నిలిచింది. నిజానికి గత వారం తొలిసారి సెన్సెక్స్ 82,000 మార్కును, నిఫ్టీ 25,000 మార్కును దాటాయి. ఇదిలావుంటే ఈ వారం ఒడిదొడుకులకు ఎక్కువగా ఆస్కారం కనిపిస్తున్నది. ఇజ్రాయెల్-హమాస్ నడుమ ఉద్రిక్తతల్ని మరింత పెంచేలా అమెరికా జోక్యం కలవరం పుట్టిస్తున్నది. అలాగే మదుపరులు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో ద్వైమాసికానికిగాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించే ద్రవ్యవిధాన పరపతి సమీక్ష ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గురువారం ఆర్బీఐ తమ పాలసీని ప్రకటించనున్నది. సుదీర్ఘకాలంగా వడ్డీరేట్లను యథాతథంగానే సెంట్రల్ బ్యాంక్ ఉంచుతున్నది తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నది. అయితే ఇప్పటికీ ధరాఘాతం కొనసాగుతున్నది. దీంతో రాబోయే సమీక్షలో వడ్డీరేట్లపై ఆర్బీఐ ఏం నిర్ణయం తీసుకుంటుందన్నదే కీలకం. ఒకవేళ ఎప్పట్లాగే వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే సమీక్ష ముగిస్తే.. ఆటో, బ్యాంకింగ్, స్టీల్, రియల్టీ, దాని అనుబంధ రంగాల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కోవచ్చు. వడ్డీరేట్లు తగ్గితే మాత్రం ఈ రంగాల్లోని సంస్థల షేర్లన్నీ లాభాలను సంతరించుకునే వీలున్నది. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. ఇక అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,100-25,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ఇల్లు కొంటున్నారా?

పీఎంఏవై పథకంలో వడ్డీ రాయితీ పొందండిలా

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం మళ్లీ వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024 -25)గాను గత నెల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో దీన్ని తిరిగి తీసుకొచ్చారు.

ఏమిటీ పీఎంఏవై?

ఈ పథకం 2015లో మొదలైంది. దేశంలోని అన్ని గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలకు పక్కా గృహాలు, కనీస వసతుల్ని కల్పించడమే ఈ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం లక్ష్యం. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ఇందులో పీఎంఏవై-గ్రామీణ్, పీఎంఏవై-అర్బన్ పేరిట రెండు విభాగాలున్నాయి. ఇంటి నిర్మాణం, కొనుగోలు కోసం తీసుకునే రుణాలపై చెల